భూగర్భ జలం కలుషితం

- రహిమత్‌నగర్ కాలనీలో దుర్వాసన వస్తున్న బోరు బావుల్లోని నీరు
- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వేడుకుంటున్న కాలనీవాసులు



ఎఫ్‌సీఐ గోడౌన్ పక్కన నిలిచిన వ్యర్థ జలాలు





బోరు బావి నుంచి వచ్చిన కలుషితమైన నీరు

కాజీపేట: అంగట్లో అన్నిఉన్నా అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా తయారైంది కాజీపేట పట్టణంలోని రహిమత్‌నగర్ కాలనీవాసుల పరిస్థితి. రహమత్‌నగర్, పాక రాజయ్య కాలనీ, విష్ణుపురి వంటి తదితర కాలనీల నుంచి వచ్చే వ్యర్థపు జలాలు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్ వద్ద నిలిచిపోవడమే ఈ సమస్యకు మూల కారణం. వ్యర్థ జలాలు గోడౌన్ లోపలికి రాకుండా ఎఫ్‌సీఐ అధికారులు అడ్డుకోవడంతో పలు కాలనీల నుంచి వచ్చే నీరు ప్రైవేట్ ఖాళీ స్థలాల్లో నిలుస్తోంది. ఫలితంగా బోరు బావుల్లోని నీరు పూర్తిగా కలుషితం అవుతోంది. దాంతో సమస్యను ఎవరికి చెప్పుకుంటే పరిష్కరం అవుతుందో తెలియక పలు కాలనీలు కుటుంబాలు ఆవేదనకు గురవుతున్నాయి.

గతంలో ఇలా ప్రవహించేది..

పలు కాలనీల నుంచి వచ్చే మురుగునీరు ఎఫ్‌సీఐ గోడౌన్ల ప్రహరీ నుంచి వడ్డేపల్లి రిజర్వాయర్ వైపు ఎలాంటి ఆటంకం లేకుండా వెళ్లిపోయేది. రిజర్వాయర్ శిఖంలో రియల్ వ్యాపారులు ప్లాట్ల వ్యాపారం చేపట్టడంతో నీటి ప్రవాహాన్ని అడ్డుకున్నారు. దీంతో ఎఫ్‌సీఐ గోడౌన్ల లోపల నీరు నిలుస్తుండటంతో అధికారులు ఆ నీటి ప్రవాహాన్ని ప్రైవేట్ భూముల్లోకి మళ్లించారు.

పెరిగిన సమస్య తీవ్రత

కాలనీల్లో ప్రభుత్వ నల్లాలతో పాటు ప్రతీ ఇంటికి ఒక బోరు ఉంది. అత్యవసర పరిస్థితుల్లో తాగునీటి అవసరాలు తీరుస్తాయనే భావనతో ముందు జాగ్రత్త చర్యగా వేలాది రూపాయలు వ్యయం చేసి తవ్వకున్న తాగునీటి బోరు బావుల్లోకి మురుగు నీరు చేరుతోంది. భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు దుర్వాసన వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ నీటితో స్నానం చేస్తే శరీరంపై దద్దుర్లు వస్తున్నట్లు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీటి కాల్వలను నిర్మించి బోరు బావులు కలుషితం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రంగు మారి దుర్వాసన వస్తోంది



బోరు బావుల్లోంచి కలుషితమైన నీటిని తోడితే వచ్చే కంపు వాసనను భరించలేక పోతున్నాం. దాంతో ఆ నీటిని వాడడమే ఆపేశాం. నల్లగా మసి బొగ్గుల నీళ్ల కనిపిస్తుంటాయి. దీనంతటికి కారణం మురుగు నీరంతా మా కాలనీ సమీపంలో నిలిచిపోవడమే.

– తేలు సారంగపాణి, స్థానికుడు

సమస్య పరిష్కారానికి కృషి



కాలనీలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్న మాట వాస్తవమే. కలుషిత నీటి సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్నాం. కొంచెం ఆలస్యం అయినా సమస్యకు శాశ్వత పరిష్కరం దిశగా ప్రయత్నిస్తున్నా.

– జక్కుల రవీందర్ యాదవ్, కార్పొరేటర్

పేదింటి పెళ్లికి చేయూత.. కల్యాణలక్ష్మి

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: పేదింటి పెళ్లికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఆర్థికంగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. 1, 2, 55, 56, 65, 66వ డివిజన్లకు చెందిన 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు మరో ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు పెద్దపీట వేస్తోందని వివరించారు. అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలకు అందజేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, పొన్నాల రఘు, హరిబాబు, గడ్డం శివరాంప్రసాద్, దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్‌లు మదన్‌గౌడ్, అనిల్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలు



హన్మకొండ అర్బన్: నగరంలోని ప్రకాశ్‌రెడ్డి పేటను స్థాపించి 75 ఏళ్లు అయినందున స్థానిక చర్చి ఆవరణలో గుడి పెద్ద మనుషులు, కమిటీ సభ్యులు, విచారణ గురువు ఏరువ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నారు. వేడుకలను విశాఖపట్నం అగ్ర పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల, ఖమ్మం పీఠాధిపతి బిషప్ సకిలీ ప్రకాశ్, ఫాదర్లు జైపాల్ రెడ్డి, ఇన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానసరాంప్రసాద్, గురువులు, సిస్టర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగించాలి



నయీంనగర్: 25 శాతం రిబేట్‌తో కూడిన ఎల్‌ఆర్‌ఎస్ గడువును పొడిగించాలని జీడబ్ల్యూఎంసీ – కుడా లైసెన్స్‌డ్ సర్వేయర్లు కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్వేయర్స్ సంఘం అధ్యక్షుడు పాము సత్యనారాయణ మాట్లాడుతూ 2020, ఆగస్టు 26 కటాఫ్ డేట్ ఎత్తివేయడం ద్వారా ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కూడా ఎల్‌ఆర్‌ఎస్, బిల్డింగ్ అనుమతి తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గడువు పెంచడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. సమావేశంలో జి.శ్రీనివాస్, కోదండరాములు, ఎండీ.సుల్తాన్, ఎండీ.అమీద్ షరీఫ్, బి.వెంకటేశ్వర్లు, కె.గణేష్ బాబు పాల్గొన్నారు.

చేప పిల్లలకు బదులు నగదు ఇవ్వాలి

హన్మకొండ: ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులుగా మత్స్య సహకార సంఘాలకు నగదు బదిలీ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ డిమాండ్ చేశారు. హనుమకొండ సమ్మయ్యనగర్‌లో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం హనుమకొండ పశ్చిమ ఏరియా కమిటీ అధ్యక్షుడు మోటం పవన్ కల్యాణ్ అధ్యక్షతన సంఘం జిల్లా హనుమకొండ పశ్చిమ ఏరియా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో నేటికీ వందలాది మంది మత్స్యకారులు వృత్తి ప్రమాదంలో చనిపోయి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ అందక ఆ కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ నగరంలో 10 ఎకరాల స్థలం కేటాయించి రూ.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హోల్‌సేల్ చేపల ఎక్స్‌పోర్టు మార్కెట్‌ను నిర్మించాలని కోరారు. సమావేశంలో నాయకులు జవ్వాజి లత, మోటం ప్రశాంత్, కట్ల సురేష్, బొజ్జ సాయి, కేశబోయిన రవి, కొటం రవి, కుదురుపాక సమ్మయ్య, సాదినేని మహేందర్, బొజ్జం భిక్షపతి, సాదినేని శివరాం, బైరి రాజ్‌కుమార్, నీరటి రాకేష్, గంగరబోయిన రాజు, బోళ్ల రాంబాబు, జవ్వాజి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డుల ప్రదానం, సన్మానం



శ్రమశక్తి అవార్డులతో దేవులపల్లి సోదరులు




అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న శ్రీధర్

కాజీపేట రూరల్: కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్‌కు శ్రమశక్తి అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం జరిగిన శ్రమశక్తి అవార్డుల ప్రదానోత్సవంలో కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ చేతుల మీదుగా అందుకున్నట్లు రాఘవేందర్ తెలిపారు. అలాగే, రాఘవేందర్ సోదరుడు, గోదావరిఖని సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న ఐఎన్‌టీయూసీ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ దేవులపల్లి రాజేందర్ కూడా శ్రమశక్తి అవార్డు అందుకున్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ శ్రమశక్తి అవార్డు గ్రహీత పి.మహేందర్ రెడ్డిని టీఎస్ఈఈయూ – 327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ సన్మానించారు. తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ – 327 ఎన్పీడీసీఎల్ శాఖ (17 జిల్లాల స్థాయి) అధ్యక్షుడు పి.మహేందర్ శ్రమశక్తి అవార్డు అందుకున్నారు. ఈమేరకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో మహేందర్ రెడ్డిని సన్మానించారు. యూనియన్ ఎన్పీడీసీఎల్ శాఖ శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్యగౌడ్ పాల్గొన్నారు.

కులగణన నిర్ణయంపై బీజేపీ హర్షం



హసన్‌పర్తి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

హసన్‌పర్తి: ప్రధాని మోదీ తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ఈమేరకు మోదీ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు చకిలం రాజేశ్వర్‌రావు, రైల్వే బోర్డు సభ్యులు మేకల హరిశంకర్, డివిజన్ కార్యదర్శి మట్టెడ సుమన్, పెద్దమ్మ శ్రీనివాస్, తాళ్ల రమేష్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలతో సమూల మార్పులు

వరంగల్: జమిలి ఎన్నికల నిర్వహణతో దేశంలో సమూల మార్పులు జరగడమే కాకుండా భారీగా ప్రజాధనం ఆదా అవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, సముద్రాల పరమేశ్వర్ అభిప్రాయ పడ్డారు. 21 డివిజన్‌లో మండల కన్వీనర్ కోట సతీష్ అధ్యక్షతన కాశిబుగ్గ మండల వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు రఘునారెడ్డి, జి.కుమార్‌యాదవ్, అపురూప రజనీష్‌నేత, సతీష్, రాజు, సునీల్, రతన్, కోట సతీష్, సత్యనారాయణ, రాకేష్, మామిడాల సతీష్ పాల్గొన్నారు.

బీజేపీ హనుమకొండ కార్యాలయంలో..

హన్మకొండ: జనగణనలో కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అన్నారు. దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, గుజ్జ సత్యనారాయణ రావు, పులి సరోత్తంరెడ్డి, ఆర్‌పీ.జయంత్ లాల్, మాలోతు నాను నాయక్, తోపుచెర్ల అర్చన, రత్నల క్ష్మి, నర్మెట్ట శ్రీనివాస్ రావు గౌడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ అందరి సామాజిక బాధ్యత



హన్మకొండ: బాల్య వివాహాల నివారణ ప్రతీఒక్కరి సామాజిక బాధ్యత అని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని స్వధార్ హోమ్‌లో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో స్వధార్ ఆశ్రమం, స్లమ్ ఏరియా పిల్లలకు బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ పెళ్లి వయస్సు రాని ఆడపిల్లల భవిష్యత్‌ను మూడు ముళ్లతో నాశనం చేయవద్దని సూచించారు. వారిని చదివించాలని, వారు కోరుకున్న రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలన్నారు. ఆడవారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అనితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్వధార్ హోమ్ బాధ్యురాలు శైలజ, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

‘భారత్ వికాస్ పరిషత్’ పాత్ర కీలకం

హన్మకొండ: సమాజాభివృద్ధిలో భారత్ వికాస్ పరిషత్ కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీ.నాగేందర్ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఓరుగల్లు శాఖ సర్వసభ్య సమావేశాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఓరుగల్లు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి కె.సత్యనారాయణ, కోశాధికారి బి.వెంకట్ రెడ్డి నివేదికను సమర్పించారు. ఎన్నికల్లో గత కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా డి.సుధీర్ కుమార్, కార్యదర్శిగా కె.సత్యనారాయణ, కోశాధికారిగా బి.వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చంచల్ అగర్వాల్, వి.గోవిందరాజులు, సహ కార్యదర్శిగా ఎం.సంతోష్ రెడ్డి, కన్వీనర్లుగా రామారావు, కమలామనోహర్, వివేకానంద ప్రసాద్, మహిళా కన్వీనర్లుగా రత్న మంజుల, డాక్టర్ ఇందిర, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్.జయపాల్ రెడ్డి, ఎం.దామోదర్, సీహెచ్.కేశవ రెడ్డి, ఎం.కేశవరావు ఎన్నికయ్యారు.

సమ్మెపై అధికారులకు నోటీస్



హన్మకొండ అర్బన్: నోటీస్ అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలోని అన్నివర్గాల హమాలీ కార్మికులు పాల్గొంటారని హనుమకొండ జిల్లా ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) జిల్లా కమిటీ నాయకులు తెలిపారు. ఈమేరకు జిల్లా లేబర్ అధికారులు, పౌర సరఫరా సంస్థ మేనేజర్‌కు సమ్మె నోటీసులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంఘం మొగిలి, బొట్ల చక్రపాణి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి అమలు చేయాలని కుట్ర పన్నుతోందని అన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పుల్ల అశోక్, కారు ఉపేందర్ పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: సమ్మెలో జిల్లాలోని అన్ని రకాల హమాలీ కార్మికులు పాల్గొంటారని హనుమకొండ జిల్లా ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ బాధ్యులు శుక్రవారం కార్మిక శాఖ అధికారులకు సమ్మె నోటీస్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయాలని చూస్తోందని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మొగిలి, చక్రపాణి అన్నారు. నోటీసు అందజేసిన వారిలో పుల్లా అశోక్, కారు ఉపేందర్ ఉన్నారు.

హమాలీల సేవలు అనిర్వచనీయం



సమస్యలు తెలుసుకుంటున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: హమాలీ కార్మికుల సేవలు అనిర్వచనీయమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కార్మిక మాసోత్సవాల్లో భాగంగా హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హమాలీ సంఘం నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల సరఫరాలో హమాలీ కార్మికులు కీలక భూమిక పోషిస్తారని కొనియాడారు. హమాలీల శారీరక శ్రమతోనే ప్రజలందరికీ నిత్యావసరాలతో పాటు ఇతర వస్తువులు చేరుతున్నాయని గుర్తుచేశారు. ఈక్రమంలో వారికి శ్రమకు తగ్గ వేతనాలు అందడం లేదని వాపోయారు. హమాలీలు అసంఘటితంగా ఉన్నారని, వారిని సంఘటితం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కాకతీయ హమాలీ సంఘం సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కాకతీయ హమాలీ సంఘం అధ్యక్షుడు లింగన్న, ఉపాధ్యక్షులు సీహెచ్.కుమార్, ఎల్.కుమార్, జి.సదయ్య, ఆర్.శ్రీను, సభ్యులు ఎస్.శంకర్, ఎస్.రాజేష్, వి.రవి, దామెర సమ్మయ్య పాల్గొన్నారు.

కూలీల హక్కులను కాపాడుకుందాం



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రాజేందర్

హసన్‌పర్తి: ఉపాధి హామీ పథకం కూలీల హక్కులను కాపాడుకుంటూ, ఆ చట్టాన్ని పరిరక్షించుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం సీతంపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ బిల్లులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా రోజుకో కొత్తచట్టాన్ని పాలకులు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాధ, నాయకులు దుర్గం సారయ్య, రాధ, ఎం.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పోచమ్మమైదాన్ నుంచి వెంకట్రామ కూడలి, నిజాంపుర, చార్‌బౌళి, రామోజ్లవాడ, కాశిబుగ్గ, ఎల్‌బీ.నగర్, మండిబజార్, భగత్‌సింగ్ నగర్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్, వరంగల్ బస్ స్టేషన్, రాంకీ, గంగా ఆస్పత్రి, దయానంద కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యాకూబ్‌పాషాకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగం పరిశోధకుడు ఎండీ.యాకూబ్‌పాషాకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆన్ రిలయబిలిటీ ఆఫ్ షాప్స్ ఇన్ మిషన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యాకూబ్‌పాషాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సుమతి ఉమామహేశ్వరి పర్యవేక్షణలో యాకూబ్‌పాషా తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆయన హనుమకొండలోని న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గణిత అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

శ్వేతార్కుడికి సప్తవర్ణాభిషేకం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామివారికి శుక్రవారం సప్త వర్ణాభిషేకం పూజలు నిర్వహించారు. వసంతోత్సవ వేడుకల్లో భాగంగా శ్వేతార్కుడికి అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో శివ కామేశ్వరీల కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. వేడుకల అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. సీతారత్నం బృందం నిర్వహించిన కోలాట ప్రదర్శన, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చలివేంద్రం ప్రారంభం



ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ శాంతినగర్ సాకరాశికుంట కట్టపై శాంతినగర్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ట రవీందర్, రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ, కాంగ్రెస్ నాయకులు ముస్కమల్ల సుధాకర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గాదు మధుసూదన్, పూజారి సంపత్ కుమార్, కోడం శివకృష్ణ, కత్తెరశాల శ్రీధర్, పులిశేరి జగదీశ్వర్, ఎండీ.ముక్దూమ్, కట్కూరి మల్లేశం, స్థానికులు పాల్గొన్నారు.

సట్టా స్థావరంపై దాడి



ఖిలా వరంగల్: ఆన్‌లైన్ సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి రూ.5,300 నగదును స్వాధీనం చేసుకుని నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి లేబర్ కాలనీలోని ప్రతాప్‌నగర్‌లోని ఓ ఇంట్లో గద్దల శ్రీలత రహస్యంగా ఆన్‌లైన్ సట్టా నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం దాడి చేశారు. ఈ సందర్భంగా శ్రీలత అదుపులోకి తీసుకుని, రూ.5,300 నగదు, సట్టా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శ్రీలతపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు కేసును అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ బాబులాల్ వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖిలా వరంగల్: తాళం వేసి కుటుంబ సమేతంగా ఊరెళ్లిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.5 వేల నగదు, 10గ్రాముల బంగారం, ట్యాబ్‌ను అపహరించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బాధితుడు వరంగల్ శివనగర్‌లోని గణపతి నగర్ కాలనీకి చెందిన సానిక రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బంగారం అపహరణ

వరంగల్: వరంగల్ ఆర్‌ఎస్‌టీ రోడ్డులోని సాయి గణేష్ జువెల్లర్స్‌లో గుర్తుతెలియని దొంగలు సుమారు మూడు తులాల బంగారు కమ్మలను అపహరించినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ ఒక ప్రకటనలో తెలిపారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

క్లుప్తంగా

ధ్యానం, యోగాతో మానసిక ప్రశాంతత



మామునూరు: ధ్యానం, యోగాతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని, విధి నిర్వహణలో ఉన్న ప్రతీ పోలీసు ఒత్తిడికి లోనుకాకుండా ధ్యానం, యోగా చేయాలని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ సూచించారు. మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో శివనగర్ ప్రజాపతి బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో పోలీసులకు మానసిక ప్రశాంతతపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం ప్రజాపిత బ్రహ్మకుమారికి ప్రిన్సిపాల్ పూజ మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో పీటీసీ అధికారులు, పీఆర్‌ఓ రామాచారి పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధన కోసం ఉద్యమించాలి

నయీంనగర్: రాజ్యాధికార సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉద్యమించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ పాదిల సాయిబాబా పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల ఉద్యమ వేదిక అన్ని జిల్లాల్లో విస్తరించాలని అన్నారు. కాజీపేట ఫాతిమా కాంప్లెక్స్‌లో మన రాజ్యాంగ హక్కులు – మన అధికారం అనే అంశంపై ఆదివారం చారిత్రాత్మక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మేకల సుమన్, మైదం రవి, సునీల్, ఏసోబ్, రవి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

హెల్త్ కమిషనర్‌కు శుభాకాంక్షలు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌గా నియమితులైన సంగీత సత్యనారాయణను సచివాలయంలో ఏహెచ్‌ఎం నాయకులు, డీపీఎంయూ సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌హెచ్‌ఎం రాష్ట్ర నాయకులు ఎండీ.రుక్మిద్దీన్, రవీందర్, కోట్య, బాబు, పీడీఎంయూ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు సన్మానం

కాజీపేట: పదో తరగతిలో 539 మార్కులు సాధించిన కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల టాపర్‌గా నిలిచిన మేరుగు మానసను విద్యా కమిటీ సభ్యులు శుక్రవారం సన్మానించారు. హెచ్‌ఎం కె.శోభ ఆధ్వర్యంలో అభినందించారు.

రైల్ మజ్దూర్ యూనియన్ నియామకం



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో పనిచేస్తున్న కుర్సపల్లి రవీందర్.. రైల్ మజ్దూర్ యూనియన్ (ఆర్‌ఎంయూ) సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆర్‌ఎంయూ సికింద్రాబాద్ జనరల్ సెక్రటరీ టి.ప్రభుచరణ్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు రవీందర్ తెలిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శంకర్



మడికొండ: సీపీఐ కాజీపేట మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. మండల కార్యదర్శిగా గుగులోతు శంకర్, సహాయ కార్యదర్శులుగా వేల్పుల సారంగపాణి, బరిగల కుడిస్వామి, కోశాధికారిగా సాలకల స్వరూప, కార్యవర్గ సభ్యులుగా మునిగాల ఐలయ్య, బొట్టు భిక్షపతి, మంద సుమన్, మునిగాల స్వామి, రాసమల్ల దీన, మద్దెల శ్రీనివాస్, రాసమల్ల కుమార్, ఈసంపెల్లి సాల్మన్, రీల్ పూర్ణచందర్, జానపట్ల మంజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



మడికొండ: ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మడికొండ శివారులో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి గ్రామం నుంచి ధాన్యం బస్తాలతో మడికొండ వైపునకు వెళ్తున్న ట్రాక్టర్.. మడికొండ వినాయక నగర్ వద్ద రోడ్డు పక్కన ఉన్న చిన్నగుంతలో టైర్ పడిపోవడంతో ట్రాలీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో అటువైపు వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పినట్లైయిందని స్థానికులు తెలిపారు.